క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు నడపాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మామడ: మండలంలోని అనంతపేట్ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం నిర్మల్‌లో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డికి వినతిపత్రం అందించారు. వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నామని బస్సు సౌకర్యం కల్పించాలని మేనేజర్‌ను గ్రామస్తులు కోరారు. బీజేపీ నేతలు కొండ్ర రాజారెడ్డి, లింగారెడ్డి, గ్రామస్తులు మల్లేశ్, రవి, రాజేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, నాయకులు

భైంసాటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో బుధవారం పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. 370 జీవో, సీపీఎస్ రద్దు, పదోన్నతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, మండలాల బాధ్యులు ఉన్నారు.

సీసీఐ కొనుగోళ్లు నిలిపివేత

భైంసాటౌన్: ఈనెల 11 నుంచి 17వరకు సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. 18 నుంచి యథావిధిగా తిరిగి కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వసతులు పరిశీలన

మామడ: మండలంలోని పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం సెక్టోరియల్ అధికారి రాజేశ్వర్ సందర్శించారు. పాఠశాలలో కోడింగ్ వర్క్‌షాప్ నిర్వహించి వసతులు తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం వాహనాల పెండింగ్ చలాన్లపై ఇస్తున్న రాయితీని ఈనెల 31 వరకు పొడిగించిన నేపథ్యంలో వాహనదారులు సద్వినియోగించుకోవాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబర్ 25 కంటే ముందు విధించిన చలాన్లను ఈనెల 31లోగా చెల్లించి సహకరించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడారు. గతేడా ది జూన్ నెల నుంచి బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని.. మంజూరు చేయాలని కోరారు. విజయ, ఆసియాభాను ఉన్నారు.

నేతకాని సదస్సుకు తరలిరండి

కడెం: మండల కేంద్రంలో ఈనెల 21న నిర్వహించే నేతకాని ఖానాపూర్ నియోజకవర్గ సదస్సుకు నేతకానిలు తరలిరావాలని నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి గంగేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సులో నియోజకవర్గ కమిటీలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గె వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు దుర్గం రాజలింగు, శేఖర్, జాడి గంగాధర్ తదితరులున్నారు.

శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడు

నిర్మల్‌టౌన్: రాజుగా ఉన్నా.. అరణ్యవాసం చేసినా ఏనాడు ధర్మం తప్పలేదు కాబట్టే శ్రీ రాముడు మర్యాద పురుషోత్తముడిగా ఇప్పటికీ పూజలందుకుంటున్నాడని గంగోత్రి ధామానికి చెందిన ఆచార్య రామానుజదాస్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక భక్తులకు సందేశమిచ్చారు. ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుందని.. ఈ నేపథ్యంలో స్వామీజీలు, వేదపండితులు అక్కడకు వెళ్లి రద్దీని పెంచే బదులు రామరాజ్య ప్రాశస్త్యంపై దేశంలో ప్రచారం చేపట్టాలని సాధుసంతుల సమావేశంలో నిర్ణయించామని పేర్కొన్నారు.

పంటలు పరిశీలన

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో రైతులు సాగు చేసిన చియ పంటలను బుధవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఏఈవో పవన్ గంగాధర్ గ్రామంలో రైతులు సాగు చేసిన చియా పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

‘పది’లో శతశాతం లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- విద్యార్థుల విద్యాస్థాయిని బట్టి గ్రూపుల వారీగా విభజన
- వెనుకబడ్డ వారిపై ప్రత్యేక దృష్టి
- ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు



లక్ష్మణచాంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యాశాఖ సూచించిన ప్రణాళిక మేరకు ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు(స్టడీ అవర్స్) నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ, సందేహాలను నివృత్తి చేస్తూ సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. మార్చి 28 నుంచి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సబ్జెక్టుల వారీగా సన్నద్ధం చేస్తున్నారు.

జిల్లాలో 6,050 మంది విద్యార్థులు..

జిల్లాలో 165 ప్రభుత్వ పాఠశాలల్లో 6,050 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇందులో ఎనిమిది రాష్ట్ర పాఠశాలల్లో 346 మంది విద్యార్థులు, 107 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3,255 మంది, 18 కేజీబీవీల్లో 734 మంది, ఐదు మైనార్టీ పాఠశాలల్లో 223 మంది, ఆరు మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలల్లో 428 మంది, ఆదర్శ పాఠశాలలో 100 మంది విద్యార్థులు, ఐదు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 391 మంది, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 84 మంది, తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులంలో 79 మంది, 13 ఆశ్రమ పాఠశాలల్లో 410 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

చివరి దశకు సిలబస్..

ఇప్పటికే పాఠశాలల్లో 95 నుంచి 97 శాతం వరకు సిలబస్ పూర్తయిందని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఉత్తమ ఫలితాలకు తీసుకుంటున్న చర్యలు..

- విద్యార్థుల స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూపునకు ఒక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జిగా నియమించారు.
- ఆ గ్రూపులోని విద్యార్థులు సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధించేలా ఉపాధ్యాయుడు చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.
- గతేడాది అక్టోబర్ నుంచి ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4:40 నుంచి 5:30 గంటల వరకు స్టడీ అవర్స్ (ప్రత్యేక తరగతులు) నిర్వహిస్తున్నారు.
- ఉదయం చదివిన అంశంపై అదే రోజు సాయంత్రం స్లిప్‌టెస్ట్ నిర్వహిస్తూ.. వెనుకబడ్డ వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- స్టడీఅవర్స్‌లో సందేహాలు నివృత్తి చేస్తూ ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించేలా చూస్తున్నారు.
- 15 రోజులకోసారి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంశాలపై ప్రధానోపాధ్యాయులు సమీక్ష నిర్వహిస్తున్నారు.
- చదివిన అంశాలపై విద్యార్థులకు స్టడీ అవర్‌లో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తున్నారు.
- గత పరీక్షల ప్రశ్నాపత్రాలను విద్యార్థుల చేత అభ్యసనం చేయిస్తున్నారు.
- వచ్చే నెల రెండో వారంలో రెండు గ్రాండ్ టెస్టులు, అలాగే డీసీబీ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

10 జీపీఏ లక్ష్యం



పదో తరగతిలో 10శాతం జీపీఏ లక్ష్యంగా చదువుతున్నా. సిలబస్ పూర్తవడంతో మా పాఠశాలలో రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

– సిద్ధార్థ, పదో తరగతి, లక్ష్మణచాంద

ప్రణాళికతో చదువుతున్న



రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల సూచనలతో ప్రత్యేక ప్రణాళికతో చదువుతున్న. పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

– ఓం తేజశ్రీ, పదోతరగతి, పీచర

గ్రూపులుగా విభజించాం



మా పాఠశాలలో 76 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. వారు వార్షిక పరీక్షల్లో ఉత్త మ జీపీఏ సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల ను 11 గ్రూపులు చేసి ఒక్కో గ్రూపునకు ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జి నియమించి చదివిస్తున్నాం.

– రాజునాయక్, లక్ష్మణచాంద హెచ్‌ఎం

‘సమగ్ర’ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతా

- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో సీఆర్పీలు

లక్ష్మణచాంద: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యా శాఖలో కీలకంగా పని చేస్తున్న క్షేత్ర స్థాయి ఉద్యోగులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని.. వారికి న్యాయం జరిగేలా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి రత్నం, గజేందర్, నవిత, విమల, సుధాకర్, శ్రీనివాసచారి, వివేక్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నివాసంలో బుధవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇద్దరు ఎమ్మెల్యేలను సన్మానించారు. మహేశ్వర్ రెడ్డితోపాటు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రవీందర్‌గౌడ్, అంజాగౌడ్, రాజాగౌడ్, బాబుగౌడ్, దశగౌడ్, రాకేష్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నిర్మల్‌రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తొడిశెట్టి రవికాంత్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చొక్కారావు, జిల్లా కోశాధికారి పోల ధర్మరాజ్, జిల్లా సహాధ్యక్షులు వహీద్ ఖాన్, మేడారపు శ్రీనివాస్, మతీన్, శివప్రసాద్, శరత్‌చంద్రారెడ్డి, వీర్భాపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

వరిసాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోన్: న్యూవెల్మల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రైతులకు వరి సాగు, జీవ న ఎరువులపై ఏవో వినోద్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. వరి సాగుకు ఖ ర్చులు పెరిగినందున వెద పద్ధతిలో సాగు చేస్తే పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరుగుతుందని తెలి పారు. భూమిలోని భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులు వాడాలని సూచించారు. యాసంగి లో పంటల సాగు వివరాలు ఏఈవోల వద్ద న మోదు చేసుకోవాలని తెలిపారు. ఏఈవో అంబాజీ, ఉప సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు అంకల్ నాగయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, ప్రభాకర్, కిషన్, మల్లయ్య, దశరథ్, నర్సయ్య, స్వామి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు మెడికల్ ఆఫీ సర్ మహేశ్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులు nsp.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

గ్రామాల్లో బెల్టుషాపులపై పోలీసుల దాడులు

భైంసారూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామశివారులో జగన్ అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా విక్రయిస్తున్న రూ.2లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో అక్రమంగా విక్రయిస్తున్న రూ.23వేల విలువైన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బుధవారం గ్రామంలోని బెల్ట్‌షాపుపై దాడి చేసి 37.5 లీటర్ల మద్యం పట్టుకున్నారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

13న సమావేశం జయప్రదం చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో ఈనెల 13న నిర్వహించే వ్యవసాయ కార్మిక, రైతు సంఘం సమావేశాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ కోరారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సహాయ కార్యదర్శులు పద్మ, శోభన్ తదితరులు హాజరవుతారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు తిరుపతి, నారాయణ, నర్సయ్య, ఉన్నారు.

12న క్రాప్‌లోన్ మేళా

పెంబి: మండల కేంద్రంలోని రైతువేదికలో ఈనెల 12న నిర్వహించే ఎస్‌బీఐలో క్రాప్‌లోన్ మేళా నిర్వహించనున్నట్లు ఏఈవో రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలి పారు. పోడు పట్టాలు అందుకున్న గిరిజనులు రుణం తీసుకునేందుకు అర్హులన్నారు. పో డు రైతులు తమ వెంట పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు, పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

తిరుప్పావై ప్రవచనాలతో విజ్ఞానం

నిర్మల్‌టౌన్: తిరుప్పావై ప్రవచనాలు విజ్ఞాన సర్వస్వం కలిగిస్తాయని ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఉపన్యాసకులు టీకే రామకన్నన్ స్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు జరిగాయి. ఈ తిరుప్పావైలో 30 పాటలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీధర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



పరిచయం చేసుకుంటున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మహమ్మద్ షరీఫ్ అలీ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పలు సూచనలు చేశారు. ఈ టోర్నీలో 30జట్లు పాల్గొంటున్నాయి. మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలుగా ప్రకటించారు. ఇందులో కౌన్సిలర్ అన్వర్‌పాషా, మాజీ కౌన్సిలర్ రఫీ ఖురేషి, సయ్యద్, సోహెల్ తదితరులు ఉన్నారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి



వేడుకల్లో విద్యార్థులు

నిర్మల్‌టౌన్: ప్రకృతిలో మార్పులతో వచ్చే సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో బుధవారం ముందస్తు మకర సంక్రాంతి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను వివరించారు. విద్యార్థులు గొబ్బెమ్మలు పెడుతూ.. హరిదాసు కీర్తనలు పాడుతూ సందడి చేశారు. ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గులు, ప్రదర్శనలు



సోన్: గంజాల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

సోన్: మండలంలోని గంజాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.రమేశ్, ఉపాధ్యాయులు, సునీత, రత్నమాల, ప్రవళిక పాల్గొన్నారు.



ముధోల్ శిశుమందిర్‌లో విద్యార్థుల ప్రదర్శన

ముధోల్: మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబంధకారిణి సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సారథి రాజు, ఆచార్యులు ఉన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

భైంసాటౌన్: యువజనోత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ భైంసాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్ మైదానంలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. జిల్లా కన్వీనర్ శశి హాజరై ప్రారంభించారు. ముందుగా వివేకానంద, చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశసేవలో యువత ముందుండాలని కోరారు. ఇందూర్ విభాగ్ ఎస్ ఎఫ్‌డీ కన్వీనర్ గంగాప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దినేశ్, ప్రకాశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బీసీ నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లా బీసీ విద్యార్థి సంఘం నాయకులు నూతన ఎస్పీ జానకి షర్మిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో బీసీ విద్యార్థి సంఘం నాయకులు మనోజ్, నితీశ్, నవీన్, శివ, సాయినాథ్, రాములు, తదితరులు ఉన్నారు.

అపరిచితులు ఫోన్ చేస్తే వివరాలు చెప్పొద్దు

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి
- సోన్‌లో కార్డన్‌సెర్చ్



సోన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

సోన్: అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు, వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. బుధవారం సోన్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం(కార్డన్‌సెర్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లో వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. అంతకుముందు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా పెండింగ్ చలాన్లు ఉన్న 200 బైక్‌లు, ఎనిమిది త్రీవీలర్స్, 4 ఫోర్ వీలర్స్‌ను గుర్తించి వాహనాదారుల నుంచి చలాన్లు వసూలు చేశారు. సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు సంతోషం రవీందర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్‌సెర్చ్

నిర్మల్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామంలో సీఐ, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 65 బైక్‌లు, 15 ఆటోలు, ఐదు కార్లపై ఉన్న పెండింగ్ చలాన్లు వసూలు చేశారు. అనంతరం ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

విహార యాత్రలో ‘విజయ’ విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని విజయ పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా హర్యానా వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి రాజ్‌భవన్‌లో గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. విద్యార్థులను కలుసుకోవడం సంతోషంగా ఉందని.. విహార యాత్రలకు వెళ్లే విద్యార్థులకు చారిత్రక ప్రదేశాలపై అవగాహన, ఆసక్తి కలుగుతాయని పేర్కొన్నారు. పాఠశాల వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలన

సోన్: ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎంపీడీవో మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 9,200 దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 4,200 దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేసినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన టీజేఎస్ ఇన్‌చార్జి

ముధోల్: రాష్ట్ర వైద్య, విద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారం టీజేఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో మంత్రిని కలిసి పలు విషయాలు చర్చించారు.

సీతక్కను కలిసిన రాజేశ్వర్

లక్ష్మణచాంద: నిర్మల్‌కు వచ్చిన మంత్రి సీతక్కను బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ లక్ష్మణచాంద మండల అధ్యక్షులు వొడ్నాల రాజేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామకృష్ణ, నాగయ్య పద్మ, సురేశ్ తదితరులు ఉన్నారు.

యాదవ సంఘ కార్యవర్గం

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామ యాదవ సంఘ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా దానవేని వెంకటేశ్, ఉపాధ్యక్షుడి గా గోపు నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్యాల రాజు, క్యాషియర్‌గా నేతుల వెంకటేశ్, రైటర్‌గా మల్యాల నరేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

రాములోరి అక్షింతలు పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో బుధవారం విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అయోధ్య రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరణలో ఉపాధ్యాయులు

ముధోల్: ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు ఎస్టీయూ కృషి చేస్తుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.భూమన్న యాదవ్ అన్నారు. బుధవారం ముధోల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు, ఎస్జీటీ, భాషా పండితుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఎస్టీయూ సంఘం క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు రమేశ్, రవిజాదవ్, గంగాధర్, ప్రసాద్, నారాయణ, వసంత్, ప్రధానోపాధ్యాయుడు అమీర్‌ఖుస్రు ఉన్నారు.